క్లుప్తంగా

పత్తి కొనుగోలు కేంద్రం పరిశీలన

నారాయణపేట: జిల్లా పరిధిలోని మారుతి కాటన్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక మార్కెట్ చైర్మన్ ఆర్. శివారెడ్డి సందర్శించి పరిశీలించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను సీసీఐ వారి దృష్టికితీసుకెళ్లి సమస్య పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా జిన్నింగ్‌మిల్ వద్ద జరిగిన అగ్నిప్రమాదాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ వెంట కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

రెండో రోజూ కొనసాగిన ధర్నా



మద్దూరు: రెనివట్ల గ్రామ పంచాయతీగానే ఉంచాలని కోరుతూ శుక్రవారం గ్రామ పంచాయతీ ఎదుట గ్రామస్తులు రెండో రోజూ ధర్నాను కొనసాగించారు. నూతనంగా ఏర్పడే మద్దూరు మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలపొద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. చిన్న ఆశన్న, సాయప్ప, కృష్ణయ్య, భద్రప్ప, మల్లప్ప, గంగప్ప, రాములమ్మ, నర్సమ్మ, పోచమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం నిర్మించాలి

మరికల్: శిథిలావస్థకు చేరిన అద్దె ఇంట్లో భయం గుప్పిట్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపిస్తున్నామని అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని బూడ్యాగానితండా అంగన్‌వాడీ కేంద్రం ఎదుట శుక్రవారం ఆమె పిల్లలతో కలిసి మాట్లాడారు. చిన్నపిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొత్తభవనం మంజూరుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడాకారుడికి అభినందన



ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 క్రీడా పోటీలను రాష్ట్రస్థాయిలో ఎంపికైన కృష్ణానాయక్‌కు పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగే రూబి క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఈ విద్యార్థి ఎంపికైనట్లు పీడీ సాయినాథ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కుసుమ, ఉపాధ్యాయులు మురళీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడితో గాయాలు

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లిలో తేనెటీగల దాడిలో నలుగురు రైతులు ప్రమాదబారిన పడ్డారు. గ్రామానికి చెందిన రైతు కుర్వ రాములు ఆయన కుమారులు మల్లేష్, ఆనంద్, డ్రైవర్ వెంకటేష్ వరికోత చేస్తుండగా మిషన్ చెట్టుకు తగలడంతో చెట్టుపైన ఉన్న తేనెటీగలు లేచి నలుగురిపై దాడి చేసి గాయపరిచాయి. గాయాల నుంచి కాపాడుకునేందుకు పరుగులు తీశారు. అనంతరం ధన్వాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

ఘనంగా సహస్రార్జున జయంతి



నారాయణపేట టౌన్: ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షత్రియుల ఆరాధ్య దైవం సహస్రార్జున జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పట్టణంలోని సమాజ్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబాభవాని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యవక్తలు మాట్లాడుతూ.. ఎస్ఎస్‌కే సమాజ్ ప్రజలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగురావు నామాజీ, రాష్ట్ర కార్యదర్శి రాజీవ్ కుమార్, నందు నామాజీ, కాంజీ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మాగనూర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 5న జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తచాటారు. ఈ పోటీల్లో శ్రావణి (9వ తరగతి) డిస్కస్ త్రోలో మొదటి స్థానం, నిహారిక లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విద్యార్థులను శాలువాతో సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అన్నారు.

బీటీ రోడ్డు లేక ఇక్కట్లు

- మండలంలో పలు గ్రామాలకు మట్టిరోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పెద్దజట్రం-నిడుగుర్తి గ్రామాల రోడ్డు ఇలా..



సమస్తాపూర్ గ్రామానికి రోడ్డు ఇలా..

ఊట్కూర్: మండలంలో పలు గ్రామాలకు బీటీ రోడ్ల సౌకర్యం లేక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఏర్గాట్‌పల్లి, జీర్ణహళ్లి, వల్లంపల్లి, చిన్నపోర్ల-ఎడివెళ్లి, చిన్నపోర్ల-పులిమామిడి, నిడుగుర్తి-పెద్దజట్రం, ఊట్కూర్-అమీన్‌పూర్, ఊట్కూర్-సమస్తాపూర్, కొల్లూర్-నాగిరెడ్డిపల్లి, బాపూర్-నిడుగుర్తి తదితర గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. మట్టి రోడ్లు, మెటల్ రోడ్లుకు మరమ్మతు చేపట్టకపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి.

ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు..

వర్షాకాలంలో గుంతల్లో నీరుచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి



మండలంలోని పలుగ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు, మెటల్ రోడ్లపై వర్షాకాలంలో గుంతలు ఏర్పడి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- సుదర్శన్‌రెడ్డి, పులిమామిడి, ఊట్కూర్

నివేదికలు పంపించాం..

ఇటీవల కొత్తపల్లి గ్రామానికి 2కిమీ బీటీ రోడ్డుకోసం రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎస్టిమేట్ చేసి ఉన్నతాధికారులకు పంపించాం. గతంలో మిగితా గ్రామాల రోడ్లకు నివేదికలు పంపించాం.

- అజయ్ కుమార్, ఏఈపీఆర్, ఊట్కూర్

యూడైస్‌లో నమోదు తప్పనిసరి

నర్వ: ప్రతి పాఠశాల వివరాలను యూడైస్‌లో నమోదు చేపట్టాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్, ఎఫ్1, ఎఫ్2, ఎస్ఏ-1పరీక్షల మార్క్సును యూడైస్‌లో నమోదు చేయాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు రాబోయే పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతిగదిలో విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. చదవడం, రాయడం, వంటి అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఓ శిరీష, ఉపాధ్యాయినీలు ఉన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

మాగనూర్: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన వారు బీఎల్ఓల వద్ద ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాపై ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

తాగునీటి బోరు మోటార్ ప్రారంభం

మాగనూర్: విద్యార్థుల దాహార్తి తీర్చిన అపార భగీరథుడు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అని పాఠశాల హెచ్ఎం నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి పాఠశాలలో బోరుమోటార్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఆయన తనసొంత నిధులనుంచి బోరు మోటారు మంజూరు చేయించారన్నారు. పాఠశాలలో ఉన్న అసంపూర్తి గదులను పూర్తిచేయాలని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, తిమ్మప్ప, వెంకట్‌రెడ్డి, అంజమ్మ, శంకర్, తాయప్ప, శివరాంరెడ్డి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కెనరా బ్యాంక్ ప్రారంభం

మక్తల్: బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలో కెనరా బ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, సీఐ చంద్రశేఖర్, చంద్రకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడి ఎన్నిక



మక్తల్: పట్టణంలోని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా మక్తల్‌కు చెందిన వాకిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సతేంద్ర శివయ్య ముదిరాజ్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం వాకిటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇవ్వడంపై ముదిరాజ్ సంక్షేమం కోసం కృషిచేస్తానని తెలిపారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



పిన్నంచర్లలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న బీరం సుబ్బారెడ్డి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు పూర్తి వివరాలను నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు. సర్వే గురించి గ్రామాల్లో దండోరా వేయించాలని నమోదు అనంతరం ఇళ్లకు స్టిక్కర్లు వేయాలన్నారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నేటి వరకు 10,800 కుటుంబాల వివరాల నమోదు చేసి స్టిక్కర్లు అంటించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్ఐ మహేష్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బా పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంపై హర్షం ప్రకటించారు. మూడో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు రూ.1,330, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.1,540, కళాశాల విద్యార్థులకు రూ.2,100లు, బాలికలకు కాస్మోటిక్ చార్జీలు రూ.275 పెంచారని గతంలోకంటే 40 శాతం అధికంగా పెరిగాయని వివరించారు. రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, అఫ్రోజ్, జుబేర్, ఖాజ, మధు ఉన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు



కోస్గిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేక్‌కట్ చేసి నాయకులకు తినిపించారు. లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, కోళ్ల వెంకటేష్, గణేష్, కట్టసురేష్, తరుణ్ పాల్గొన్నారు.

- కోస్గి పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ సభ్యులు దేవేందర్, హాజీబాయ్, నాయకులు అన్నకిష్టప్ప ఉన్నారు.
- ధన్వాడలోని కాంగ్రెస్ జెండా కట్ట వద్ద పార్టీ కార్యకర్తలు కేక్‌కట్‌చేశారు.
- కొత్తపల్లి మండలంలో సీఎం రేవంత్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చేసిన కృషి ఎనలేనిదన్నారు.



మరికల్‌లో

- నర్వలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు.
- ఊట్కూరులోని మహిళా సమైక్య భవనంలోని దివ్యాంగుల కేంద్రంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్‌గౌడ్, వెంకటమ్మ, లక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.
- మరికల్‌లోని ఇందిరగాంధీ చౌరస్తాలో నాయకులు కేక్‌కట్‌చేశారు. సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, సురెందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత గాంధీ బాటలో నడవాలి

కోయిల్‌కొండ: జాతిపిత మహాత్మా గాంధీ బాటలో యువత నడవాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. 'బాపుబాటలో' సత్యశోధన పాదయాత్ర శుక్రవారం కోయిల్‌కొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మహాత్మాగాంధీ సిద్ధాంతాలను వివరించారు. 100 రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు పాదయాత్రలో భాగంగా కోయిల్‌కొండలో పర్యటించారు. రాము, మాజీ ఎంపీటీసీ బండి యాదవ్‌కుమార్, దిలీప్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులోకి పాఠశాల భవనం

దామరగిద్ద: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల భవనం ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. గతనెల 19న సాక్షిలో ''వినియోగంలోకి వచ్చేదెన్నడో'' అనే వార్త కథనానికి స్పందించిన అధికారులు కాంట్రాక్టర్ చొరవతో మరుగుదొడ్లు, ప్రహరి వంట గది నిర్మాణం పనులు చేపట్టడంతో శుక్రవారం ఎంఈఓ కృష్ణారెడ్డి అద్దె భవనంలో నుంచి కొత్త భవనంలోకి విద్యార్థులను తరలించి పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అలవేలు ఆధ్వర్యంలో కొత్త భవనంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. పాఠశాల భవనం పెండింగ్ నిధులు విడుదలచేసి పాఠశాల మౌళిక వసతులను పూర్తి స్థాయిలో మెరుగుపరచాలని కోరారు. పెండింగ్ ఉన్న బిల్లులను అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కాంట్రాక్టర్ శరణప్ప కోరారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

అనంతరం భవన నిర్మాణం ఉపయోగంలోకి వచ్చేందుకు సహకరించిన అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అలవేలు, ఉపాధ్యాయులు కాంట్రాక్టర్ శరణప్ప, బస్వంత్‌రాజ్, భీంషప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో అవగాహన ర్యాలీ

మద్దూరు: జిల్లా మహిళ, చైల్డ్ వెల్‌ఫేర్, బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఈ ర్యాలీని తహసీల్దార్ మహేష్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాతబస్టాండ్ చౌరస్తా మీదుగా, ఎంపీడీఓ, కొత్తబస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. పిల్లలు బాల్యంలో మగ్గకూడదనే ఉద్దేశంతో ర్యాలీ చేపట్టినట్లు జిల్లా బాలల విభాగం డీసీపీఓ తిరుపతయ్య తెలిపారు. అధికారిణి కరిష్మా, సూపర్‌వైజర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

నారాయణపేట: పట్టణానికి చెందిన మాజీ బీజేపీ కౌన్సిలర్ సూర్యకళ భర్త సీనియర్ బీజేపీ నాయకులు రాంరెడ్డి శుక్రవారం సీవీఆర్ భవన్‌లో మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి శివకుమార్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, ఎండీ సలీం, నాయకులు బండి వేణుగోపాల్, మనోహర్ గౌడ్, గందే చంద్రకాంత్, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న కేఎస్ఆర్

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

మద్దూరు: ఆరోగ్యంగా ఉండే ప్రతి వ్యక్తి రక్తదానం తప్పనిసరిగా చేయాలని కడా వెంకట్‌రెడ్డి సూచించారు. సీఎం రేవంత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రి అవరణలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసే వారి వివరాలను సేకరించి అవసరమైనప్పుడు వీరి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రి నుంచి మెడికల్ అధికారిణి పావని, సిబ్బంది చంద్రశేఖర్, నరేష్, శ్రీవాణి దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. 41మంది రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీములు, రఘుపతిరెడ్డి, మహేందర్ రెడ్డి, హన్మిరెడ్డి, రమేష్‌రెడ్డి, మల్లికార్జున్, అశోక్, వీరారెడ్డి, బాబుస్వామి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగిన అండర్ -14 మండలస్థాయి పోటీలలో జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం భారతి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ నర్సింహులు అభినందించారు. జిల్లాస్థాయిలో విద్యార్థులు రాణించి రాష్ట్ర జాతీయస్థాయిలో ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయికి ఎంపికై నందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దారులన్నీ కురుమూర్తి వైపే..



నర్వ నుంచి తరలివెళ్తున్న భక్తులు

నర్వ: పేదల తిరుపతిగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కురుమూర్తి రాయల స్వామిజాతరకు భక్తులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ఈ ఉద్దాల ఉత్సవాలకు తమ ఇళ్లను శుభ్రం చేసుకుని వాహనాలలో తరలివెళ్లారు.



మరికల్ నుంచి తరలివెళ్తున్న భక్తులు

మరికల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లు, ఆటోలు, బస్సులలో భక్తులు కురుమూర్తికి తరలివెళ్లారు. అత్యధికంగా వాహనాలు తరలివెళ్లడంతో మహబూబ్‌నగర్ రోడ్డు వాహనాలతో రద్దిగా మారింది.

స్వర్ణకారుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: స్వర్ణకారుల సహకార సంఘం ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గాడి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా విష్ణు, నర్సింహ, కార్యదర్శులుగా మునీందర్, రాముడు, లక్ష్మణ్, సహాయకార్యదర్శులుగా చంద్రశేఖర్, కరుకొండ, రవి, రాజు, కోశాధికారులుగా జిన్నారం శ్రీను, లక్ష్మణ్ తో పాటు 14 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలి

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పర్యటించి అర్హులతో మాట్లాడారు. వెంటనే కొత్త పెన్షన్లు ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో శేఖర్, యూనూస్, సమీర్ తదితరులు ఉన్నారు.